క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈఈ వెంకటరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ లైన్ల మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీడీఏ, పట్టణ ఫీడర్‌ల పరిధిలోగల బైపాస్ కాలనీ, అజయ్‌నగర్, మారుతీనగర్, ఇందిరాకాలనీ , సౌందర్య రోడ్డు నుంచి కుమ్మరివీధి వరకు, చెరువుగట్టు, గాంధీ సత్రం, దేవీనగర్, కృష్ణపల్లి, సారిక వీధి, జగన్నాథపురం, రెడ్డివీధి, పాతరెల్లివీధి, కుసుమగుడి వీధి, బెలగాం, జీఎస్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, కలెక్టరేట్ ప్రాంతంలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

మంత్రి బొత్స పర్యటన విజయవంతం చేయండి

• ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: నియోజకవర్గంలో నవంబర్ 1న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక బస్సుయాత్రకు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సన్నాహక సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

సీతంపేట: గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీ గురుకులాలకు అరటి పండ్లు, చికెన్ సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమడి గురుకుల పాఠశాల, సీతంపేట, కారిగూడ మినీగురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్‌కు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు సొమ్ము ఆయా సంస్థల పేరిట డీడీల రూపంలో టెండర్ షెడ్యూల్‌కు జత పర్చాలన్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు రూ.500లు నగదు చెల్లించి టెండర్ షెడ్యూల్‌ను గురుకులం సెల్‌కు అందజేయాలన్నారు. 26న టెండర్ ఐటీడీఏలో నిర్వహించనున్నామని తెలిపారు.

కొనసాగుతున్న వృత్యంతర శిక్షణ



ఆటపాటలతో శిక్షణ సాగిస్తున్న భాష వలంటీర్లు

సీతంపేట: ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న సవర భాష వలంటీర్‌లకు వృత్యంతర శిక్షణ మూడో రోజు ఆట, పాటలతో కొనసాగింది. చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యాబోధన ఎలా బోధించాలనే అంశమై డీఆర్‌పీలు వివరించారు. సవర భాషలో గేయాలు, డ్యాన్సులతో అలరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, పీఎంఆర్‌సీ స్టాఫ్ ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, ఏవైఎస్ సొసైటీ ప్రతినిధులు వెంకటరావు, ఎస్.చిన్నరాయుడు, బి.తర్మి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం అరుదైన శస్త్ర చికిత్స చేసినట్టు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కడుముకు చెందిన తాలవలస ఉష బొడ్డు హెర్నియాతో బాధపడుతూ ఈ నెల 16న ఆస్పత్రిలో చేరింది. వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఆమెను ఉంచి జనరల్ సర్జన్ డీవీ శ్రీనివాసరావు, మత్తు డాక్టర్ జోయల్ రత్నాకర్‌ల బృందం ఆపరేషన్ చేశారు. మెష్‌తో అనాటమికల్ రిపేర్ చేసినట్టు తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామానికి చెందిన బడిశెట్టి త్రినాథ్ అనారోగ్యంతో కొద్ది రోజుల కిందట మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులకు గురువారం గ్రామ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకర్, ఎంపీటీసీ జి.విద్యారాణి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేల నగదును అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విలువైన వైద్యసేవలను వినియోగించుకోవాలి

• ఎమ్మెల్యే అజలంగి జోగారావు



పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: విలువైన వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని నర్సిపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న ఆరోగ్య పరీక్షలతో పాటు, శిబిరంలో వైద్యపరీక్షలు ఉచిత మందుల ఏర్పాట్లను పరిశీలించారు. రోగులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అందరికీ చక్కని వైద్యం అందేలా చూడాలని సూచించారు. దివ్యాంగులు, వృద్ధులు, చిన్న పిల్లల తల్లిదండ్రులను ప్రత్యేకంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని పూర్తి సహాయ సహకారాలు అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ వెంపల గురురాజు తదితరులు పాల్గొన్నారు.

534మందికి వైద్యసేవలు

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 534మందికి వైద్యసేవలు అందించామని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి తెలిపారు. వైద్యసేవలు అందించి అవసరమైన వారిని రిఫరల్ చేశామని చెప్పారు. వైద్యసేవలు పొందిన వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ఎంపీపీ నాగమణి వైద్యశిబిరాన్ని, అంగన్వాడీ స్టాల్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైద్యులు కిరణ్మయి, శివగాయత్రి, జ్యోతి, గణేష్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీ రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

సీతానగరం: వ్యాధుల బారిన పడినవారు అవి తగ్గుముఖం పట్టేవరకూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అండగా ఉంటుందని ఎవరూ అధైర్య పడవద్దని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గాదెలవలసలో పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సచివాలయ కన్వీనర్‌లు బి. శివకుమార్, బి.తిరుపతి రావు, బోగి శంకరరావు, ఎంపీడీఓ బి కృష్ణమహేష్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ సిబ్బంది, గ్రామవలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



బలిజిపేట: నారాయణపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపీపీ నాగమణి

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, పేదల చెంతకే వైద్యాన్ని తీసుకువచ్చారని సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్‌లు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని 11వ సచివాలయానికి సబంధించి ప్రభుత్వ బాలికోన్నతపాఠశాల వద్ద నిర్వహించిన వైద్యశిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్, మండలంలోని పెదపదం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎంపీడీఓ పార్వతి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల బాగోగులు చూసేవాడే నాయకుడు

మక్కువ: మండలకేంద్రం మక్కువలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, వైద్యాధికారి హరికృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్వాడీకార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సీతానగరం: శిబిరంలో రోగులకు భరోసా ఇస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పాచిపెంట: మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

ముఖ్యమంత్రిని మరోసారి దీవించండి

పాచిపెంట: సంక్షేమ పథకాల ద్వారా ఓవైపు, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా మరోవైపు ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా మరోసారి దీవించాలని ఎంపీపీ బద్నాన ప్రమీల కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని పణుకువలస గ్రామంలో స్థానిక సర్పంచ్ చెల్లూరి సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించి, ఆరోగ్య సమస్యలను దూరం చేయాలనే ప్రధాన ఉద్దేశంతోనే ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడంగి సింహాచలం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సాలూరు: పెదపధంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ కిట్లు అందిస్తున్న వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



సాలూరు: వైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ



మక్కువ: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న మావుడి సోదరులు

‘రీ’సర్వే సిబ్బందికి సహకరించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో అమలు చేస్తున్న జగనన్న సమగ్ర ‘భూ’ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న మూడో విడత రీసర్వే ప్రక్రియకు రైతులంతా సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన రామవరం పంచాయతీ రెడ్డి వానివలస రామమందిరం వద్ద రీ సర్వే పనులపై రైతులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సంబంధించిన, ప్రభుత్వ భూములైనా పరిరక్షించడానికి సమగ్రమైన భూసర్వే చేస్తున్నట్లు చెప్పారు. అందుకు గ్రామంలో ముందుగా ప్రభుత్వ భూములను సర్వేయర్లు గుర్తించడం, తదనంతరం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. రైతులు జిరాయితీ భూములకు సంబంధించిన రికార్డులు, క్రయచీట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు అవసరమైన సమయంలో చూపించాలని సూచించారు. అలాగే డీ పట్టా భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గౌరీశంకరరావు, వీఆర్వోలు, గ్రామ వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : డీఎస్పీ

పాలకొండ: దసరా సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో ట్రాఫిక్ పెరగడంతో సమస్యను పరిష్కరించేందుకు డీఎస్పీ కృష్ణారావు చర్యలు తీసుకున్నా రు. ఒక వైపు అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల తో ప్రధాన రహదారి రద్దీగా మారింది. మరో వైపు పార్వతీపురం - విజయనగరం హైవే బ్రిడ్జి పాడవడంతో అటుగా వెళ్లాల్సిన భారీ వాహనాలను పాలకొండ మీదుగా మళ్లించారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. దీంతో గంట ల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో గురువారం డీఎస్పీ రహదారులు పరిశీలించి భారీ వాహనాలను అన్నవరం రహదారి మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నారు. అన్ని సెంటర్లు వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఒకవైపు వాహనాలు వెళ్లిన తరువాత మరో వైపు నుంచి వాహనాలను పట్టణంలోని అనుమతించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సహకరించాలని కోరారు. తమ సిబ్బంది అందించిన సూచనలు పాటించి ట్రాఫిక్ నిలిచిపోకుండా అవగాహన పెంచుకోవాలని కోరారు.

గ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారం

పార్వతీపురంటౌన్: నియోజకవర్గంలోని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించి గ్రామాల్లో పర్యటించడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని చందలింగి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు పరిష్కరించడానికి ఉన్నాయా అని ప్రశ్నించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన ఊయక లక్ష్మి భర్త నరసన్న ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. లక్ష్మి కుటుంబానికి కొంతమొత్తం ఆర్థిక సాయం చేసి పిల్లలను బాగా చదివించాలని అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చందలింగి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వేతనదారులకు శతశాతం పనులు

పాలకొండ రూరల్: వలసలు నివారించి ఉపాధి వేతనదారులకు శతశాతం పనులు కల్పించేలా ప్రత్యేక వార్షిక ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు ఆ పథకం ఏపీఓ ఎం.ఈశ్వరమ్మ అన్నారు. గురువారం గ్రామ సర్పంచ్ రణస్థలం రమాదేవితో కలసి గ్రామ సభ నిర్వహించారు. రానున్న ఏడాదిలో ఏ నెలలో ఏ పని చేయాలో వేతనదారులకు అర్థమయ్యేలా ప్రణాళికా చిత్రం వేసి అవగాహన కల్పించారు. పండ్ల తోటలు, నీటి వనరుల అభివృద్ధితో పాటు గ్రామస్తులు సూచించిన అభివృద్ధి పనులు రూ.2 కోట్లు ఖర్చు అయ్యేలా అంచనాలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాచలం, టెక్నికల్ సహాయకులు ప్రసాద్, ఉపాధి జేఈ పద్మ పాల్గొన్నారు.



ఉపాధి వార్షిక ప్రణాళికపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, అధికారులు

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

• ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రార్థించారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను గురువారం ఆయన తన కుమారుడు శ్రీరామ్‌పవన్ దొరతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రికి ఆలయవర్గాలు శాస్త్రోక్తంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికాయి. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి రాజన్న దొర ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం తరువాత ఆలయ అధికారులు ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు అమ్మవారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను అందించారు.



సాలూరు: ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు జ్ఞాపిక అందిస్తున్న కనకదుర్గమ్మ ఆలయ అధికారులు, వేదపండితులు

వరుణుడు కరుణించాలని పూజలు

సీతానగరం: వరుణుడు కరుణించి వర్షాలు కురిపించేలా అమ్మవారు ఆశీర్వదించాలని కోరుతూ సీతానగరం మండలంలోని గాదెలవలసలో గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ భూముల్లో రైతులు వరి పంట సాగు చేశారని, వర్షాభావ పరిస్థితుల కారణంగా వరిచేలు ఎండి పోవడంతో పెట్టిన పెట్టుబడి... న్నం పెడుతున్న రైతన్న ఇబ్బందులు పడుతున్నాడన్నారు. వరుణ దేవుడు వర్షాలు కురిసేలా దీవించాలని పూజలు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బలగ శ్రీరాములునాయుడు, బొన్నాడ తిరుపతిరావు, సోషల్‌మీడియా ప్రతినిధి శివకుమార్,ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

4 వేల మందికి అన్నసంతర్పణ..

మండలంలోని గాదెలవలసలో బి.తిరుపతిరావు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన దుర్గాదేవి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు గురువారం 4 వేలమందికి అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సాలూరు: కామాక్షమ్మ ఆలయంలో సామూహిక చండీ కుంకుమ పూజలు

దుర్గమ్మకు మహాచండీ అలంకరణ

పార్వతీపురంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీపురం పట్టణంలోని బెలగాం దుర్గాలయం, వెంకంపేట గోరీల వద్ద దుర్గాలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, కొత్తవలసలోని దుర్గాలయంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తవలస ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు.

బలిజిపేట: మండలంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారిని శ్రీ మహా చండీ దేవిగా అలంకరించి ఘనంగా పూజలు చేశారు. అందులో భాగంగా అజ్జాడలో శ్రీ విజయదుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని శ్రీ మహాచండి అవతారంలో అలంకరించి పూజలు జరిపించారు. బలిజిపేటలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



జమ్మిడివలసలో పూజలు చేస్తున్న మహిళలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సాలూరు: దేవిశరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి.పట్టణంలో కామాక్షమ్మ, పంచముఖేశ్వర స్వామి, కన్యకాపరమేశ్వరి తదితరఆలయాలతో పాటు ప్రత్యేక మంటపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.శరన్నవరాత్రులలో ఐదవ రోజైన గురువారం పట్టణంలో కామాక్షమ్మ ఆలయంలో సామూహిక చండీ కుంకుమ పూజ నిర్వహించారు. పంచముఖేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అన్నపూర్ణదేవి అలంకరణలో జ్ఞానసరస్వతి అమ్మవారు దర్శనమిచ్చారు. నెలకొంది.



పార్వతీపురం టౌన్: బెలగాం దుర్గాలయంలో మహాచండి అవతారంలో అమ్మవారు



పార్వతీపురం టౌన్: కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు



బలిజిపేట: అజ్జాడలో శ్రీ మహా ఛండీదేవి అవతారంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



శ్రీస్కన్దమాతగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



సాలూరు: ప్రత్యేక అలకంరణలో కామాక్షమ్మ తల్లి

గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



గుమ్మలక్ష్మీపురంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం: గిరిజనుల కోసం ప్రవేశపెట్టిన చట్టాలన్నీ పకడ్బందీగా అమలు జరపాలని సీపీఐ, ఏపీ గిరిజన సమాఖ్య నాయకులు కూరంగి మన్మథరావు, టి.జీవన్ అన్నారు. ఈ మేరకు గిరిజనులకు కల్పించబడిన చట్టాలను అమలు పర్చాలన్న ప్రధా న డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు గురువారం ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్‌షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాల జాబితాలో చేర్చాలని, గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, గిరిజనులు సాగు చేస్తు న్న, సేకరిస్తున్న పంటలకు మద్దతు ధర కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుండంగి లింగరాజు, గరుగుబిల్లి సూర య్య, పువ్వల ప్రసాద్, సింగన్న, మండంగి రామారావు తదితరులున్నారు.